# అక్షరాంజలి

## నేను చదివిన (పాత) కొత్త పుస్తకం

# విశ్వనాధ 'ఆత్మకథ'

### గొల్లపూడి మారుతిరావు

చిన్నప్పుడు పసివాడు బొమ్మల పుస్తకాన్ని 'చూస్తాడు'. కాస్త ఎదిగాక పెద్దబొమ్మలు, చిన్న కథలూ వున్న పుస్తకాన్ని 'చదువుతాడు'. మరి కాస్త పెరిగాక రెక్కల్తో ఎగిరే మనుషులూ, వరాలిచ్చే దేవతలూ, ఆలోచనల్ని ఆకాశంలో నిలిపే అభూత కల్పనల్ని ఆహ్వానిస్తాడు. ఇంగ్లీషు చదువులయితే హారీ పోటర్, తెలుగు చదువులయితే ప్రహ్లాద చరిత్రలాంటివి ఆకర్షిస్తాయి. ప్రహ్లాదుడ్ని కొండలమీద నుంచి తోసేసినా చచ్చిపోకుండా పాటలు పాడడం, మనిషీ, జంతువూ కాని పెద్ద ఆకారం ఓ రాక్షసుడిని చంపడం వంటి మెలోడ్రామా పసి మనస్సుని ఆహ్లాద పరుస్తుంది. (ఈ తరం వారికి ఆ కథలు తెలియక పోతే తప్పు వాళ్ళది కాదు. తల్లిదండ్రులది) మరికాస్త ఎదిగాక కాశీ మజిలీ కథలు నచ్చుతాయి. మనస్సు ఊహించే కల్పనలు, ఉచ్చులూ ఆకర్షిస్తాయి. యువరక్తం నిలదొక్కుకొంటున్నప్పుడు నవలలూ, కథల వైపు మనస్సు లాగుతుంది. జీవితం మధ్య వయస్సులోకి వచ్చినప్పుడు తన వెనక చరిత్రని తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతుంది. చరిత్రా, వాస్తవం ఎరగాలనే దశ అది. జీవితం సాయంకాలంవైపు మొగ్గు చూపినప్పుడు-వెనక్కి వెళ్ళి చెప్పిన ఆత్మకథ వైపు మనస్సు పోతుంది. మహానుభావుల జీవికలూ, వారి జీవితం నేర్పే పాఠాలూ ఆకర్షిస్తాయి. మరి కాస్త ముందుకు పోతే- వృద్ధాప్యం 'ఈ జీవితం తరువాత ఏమిటి?' అనే ప్రశ్నని సిద్ధం చేస్తుంది. సత్కర్మ, సంస్కారం కలిసివస్తే పురాణాలు, భగవద్గీత చేతికి వస్తాయి. ముసలితనం ముసురుకొన్నప్పుడు-పోయినవాళ్ళ వార్తల్ని చదవాలనిపిస్తుంది-తన తరం వాళ్ళు ఎవరు సెలవు తీసుకొంటున్నారో తెలుసుకోవడానికి. ఇది మనిషి ఆలోచనల పరిణామం.

ఆత్మకథ జీవుని వేదనను వివరిస్తుంది. ఆ వ్యక్తి జీవితాన్ని సమీక్షిస్తుంది. ఆత్మకథ ఓ వ్యక్తి జీవితానికి అందమయిన అధోజ్ఞాపిక (foot note) నన్ను చాలా బాగా ఆకర్షించిన ఆత్మకథలు రెండు భాషల్లోనూ రెండేసి ఉన్నాయి. ఇంగ్లీషులో చార్లీ చాప్లిన్ 'మై ఆటోబయోగ్రఫీ', స్వామి పరమహంస యోగానంద 'ఆటోబయోగ్రఫీ ఆఫె యోగి'. తెలుగులో ఆదిభట్ల నారాయణదాసుగారి 'నా యెఱుక', శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'అనుభవాలూ-జ్ఞాపకాలూ'. మరొక హృద్యమైన స్వీయకథ ఆచంట జానకీరామ్‌గారి 'సాగుతున్న యాత్ర'. అలాగే ఇంగ్లీషులో చెప్పవలసి వస్తే ఎమ్.సి.చాగ్లా 'రోజెస్ ఇన్ డిసెంబర్'.

ఇదిగో, ఈ సందర్భంలో డాక్టర్ పప్పు వేణుగోపాలరావుగారు చెప్పారు- విశ్వనాధవారి ఆత్మకథ తన దగ్గర ఉందని. ఈ తరంవారికి విశ్వనాధ వారు తెలియకపోవచ్చు. తెలిసిన వారికీ వారు ఆత్మకథ రాశారని తెలియకపోవచ్చు. తెలిసిన ఆ కొద్దిమందికీ ఆత్మకథ చదివే అవకాశం రాకపోవచ్చు-అది ముద్రణలో లేదు కనుక.

మా తరానికి విశ్వనాధ మేరుశృంగం. ఆయన 1971లో ఆత్మకథ ప్రారంభించి కేవలం 65 పేజీలు మాత్రమే రాశారు. తెలుగు సాహిత్యానికి జరిగిన పెద్దనష్టం వారు ఆత్మకథని పూర్తి చెయ్యకపోవడం. పుస్తకం నా చేతికి రావడానికి-పుస్తకాలు మరొకరికి యివ్వడానికి సందేహించే పప్పుని (ఆ అలవాటు నాకూ ఉంది) బెల్లించి, ఫోన్లు చేసి, ప్రతిజ్ఞలు చేసి-చాలా శ్రమపడి తెచ్చుకొన్నాను. తీరా పుస్తకం చేతికి వచ్చాక 65 పేజీలూ చదివిన తర్వాతే పుస్తకాన్ని కింద పెట్టగలిగాను.

ఆత్మకథ మీద ఆసక్తికి మొదటి ప్రేరణ- ఆ కథకి కారణమయిన వ్యక్తి ప్రాచుర్యం, ఆ వ్యక్తి పట్ల మనకి ఉన్న ఆకర్షణ, గౌరవం. ఒక తరాన్ని తన అందంతో వెర్రెత్తించిన హెడీ లామర్ (శాంసన్ అండ్ డెలైలా హీరోయిన్) తన ఆత్మకథని రాసింది 'టియర్స్ అండ్ స్మైల్స్' అని. అంతా ఆరోజుల్లో విరగబడి చదివారు.

విశ్వనాధవారు ఆత్మకథ గురించి అద్భుతమైన వివరణ మొదట్లోనే యిచ్చారు. 'ఎలుక యెంతవఱకు తన వైపునకే తవ్వుకొను నన్నట్లు ఆ కవి యొక జీవుడు. వాడనుభవించినాడు. వాడు స్వానుభవాభిముఖముగానే చెప్పును. సుగ్రీవుడు శ్రీరామచంద్రునితో తనకు తన యన్నగారు చేసిన యపకారము తన దృష్టితో చెప్పినాడు. దానినే వాలిని చెప్పమన్నచో నది యెట్లుండును? ఇది వాల్మీకి దోషము కాదు. లోకములో జరిగెడి కథలయందు సహజముగా నున్న దోషము.'

మరొక గొప్ప మాట. కవిత్వం రసానుభూతిని కలిగిస్తుంది. కాని కవి జీవిత విశేషం బుద్ధిని మాత్రం చమత్కృతం చేస్తుంది. రసానుభూతిని కలిగించే శక్తి లేదు. నాకు బొత్తిగా తెలుగులో చెప్పడం రాదు.'It may not be good poetry, but it qualifies the poet.

విశ్వనాధవారి రచనల్నీ, పెళుసుదనాన్నీ ఎరిగినవారికి ఆయన మాటల్లో చదువుతూంటే నాలాంటి వాడికి వెర్రెక్కుతుంది. 'మనస్సులో చచ్చెడు యహంకారము. నేనెవ్వరికిని నపకారము చేయను. చేయలేను. నా మొగము చూచినచో, నేను మాటాడెడు పద్ధతిని తిలకించినచో వానికి నే నహంకారినని పొగరుబోతునని యూహ కలుగుట...వానికి శారీరకముగా శిక్ష వేయవలెనన్న యూహ ఏర్పడును. వాడుక భాషలో చెప్పినచో వానిని తన్నవలె ననిపించును. ఈ స్థితి నా కుండెడిది.'

అయితే దానికి కారణాన్నీ వారే చెప్పుకొన్నారు. వారి వూరు నందమూరులో 'మేమే ప్రభువులము. ఆ గ్రామము మాది. ఈ ఈ కారణములచేత మాకుదురులో నొక దురహంకారము- ఒక ఠీవి- ఎవడన్నను లెక్క చేయని యొక్క లక్షణము, చప్పున మాటతూలుట-మన మాటయే సాగవలయునన్న యొక యహంకారము కలవు. ఈ లక్షణములు నాలో క్రమక్రమముగా వృద్ధిపొందినవి.'

వారి వూరు-నందమూరు-మనకి తెలియకపోతే-ఈ పుస్తకం చదివితే చాలు-రవిగాంచని ఎన్నో వైభవాలను వివరిస్తారు. ఆ వూరి పంట పొలాలు, సావిళ్ళు, వ్యక్తులు- అంతా కళ్ళ ముందు నిలుస్తారు. వారి ఋతుసంహారంలో కనిపించే ప్రతీ మేఘం, వర్షించిన ప్రతీ వర్షపు చినుకూ, తడిసిన ప్రతీ గడ్డి పరకా- చిన్నతనం నుంచీ వారి అనుభవంలోకి తొంగిచూసినవేనని మనకి తెలుస్తుంది.

మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, మద్రాసు విశ్వవిద్యాలయంలో చరిత్రశాఖ అధ్యాపకులు నేలటూరి వెంకట రమణయ్యగారు ప్రతి దినం విశ్వనాధవారు రాసిన పద్యాలను విని 'మెచ్చుకొనలేక విఱుగబడి పోయెడివారు' అన్నారు. ఆ గ్రంథాన్ని మల్లంపల్లి వారికి 1924 ప్రాంతంలోనే అంకితం యిస్తూ 'డిగ్రీలు లేని పాండిత్యం వన్నెకురాని పాడు కాలాన బుట్టి' అన్న పద్యాలు రాసినట్టు ఉటంకించారు.

వారు చదువుకి వెళ్ళిన వెలినూతల నుంచి నాగవరప్పాడి ప్రయాణాన్ని ఇలా చెప్తారు: 'కొత్తగా కాలువకు ప్రతీ యేడు నీరు వచ్చును. అది పెద్ద పండుగ. అయిదారు దినములూరంతయూ బిందెలు పుచ్చుకొని ఈ మైలున్నర నడిచి కాలువకు బోయి స్నానాలాడి తబకలాడి తమ తమ కనుకూలమయిన పాత్రలలో-తియ్యని కృష్ణనీరు తెచ్చికొందురు, అప్పటికి మింటిలో మొయిళ్ళు పట్టవు. నీటి కెఱ్ఱదనము లేదు. నీరు కొబ్బరి పాల వలె నుండును'- యిలాంటి తెలుగు భాష, యింత చక్కటి నుడికారం ఇంగ్లీషు మరిగిన ఈ తరానికి అరగని భోజనం. ఈ అనుభవంతో వారు తన కల్పవృక్షములో భగీర

**మీకు నచ్చిన మంచి నవలల గురించి మీరూ ఈ పేజీల్లో రాయవచ్చు. ఇలాగే మొత్తం నవలని పరిచయం చేయగలిగితే నాలుగు అరఠావులు మించకుండా పేజీకి ఒకవైపే రాసి పంపండి. అమ్మో, అంత రాయలేం అనిపిస్తే మీకు నచ్చిన పుస్తకం గురించి ఒక అరఠావు పేజీ రాసి పంపించండి. చిరునామా తెలుసుగా. కవరుమీద 'అక్షరాంజలి' అని రాయడం మరిచిపోకండి.**

ధుడు తెచ్చిన గంగానది వర్ణన చేశానంటారు.

జీవితంలోని వ్యక్తులు కావ్యాల్లో పాత్రలెలా అవుతారో విశ్వనాధవారు చేసి చూపారు. 'మా నాయనమ్మ వృద్ధురాలు. మా నాయనగారు ఇందుపల్లిలో మాకు వంట చేయుటకు మా నాయనమ్మను పెట్టెను. ఆ యూరిలో పురాతనమయిన యొక విష్ణ్వాలయ మున్నది'- ఆవిడ గురించి తెలుసుకోవాలంటే ఆయన ప్రధమ కళత్రం పోయాక వ్రాసిన వరలక్ష్మీ త్రిశతియనే వియోగ కావ్యం చదవాలి.

కొల్లూరు దగ్గర ఆనతవరము అనే గ్రామం వుంది. అక్కడ విశ్వనాధవారి అన్నయ్య మేనమామ సీతారామశాస్త్రిగారు భిక్షాటనము చేసుకొని బతికేవాడు. ఆయన వైశ్వదేవపరుడు. జన్మలో రైలెక్కలేదు. అగ్నిహోత్రము మానలేదు. బ్రాహ్మణుడు ఆపద్ధర్మముగా వ్యవసాయము చేయవచ్చునుగాని భిక్షాటనము వదిలిపెట్టి మరియొక వృత్తి చేయరాదన్న నియమమును జీవితాంతము నెఱపినవాడు. విశ్వనాధవారి తండ్రి పేరు శోభనాద్రిగారు. విశ్వనాధవారి మాటల్లో వారి పెళ్ళి ఎలా జరిగిందో చదవండి: 'ఆయన మా నాయనగారి మీద నొక నింద వేసెను. 'నేను భిక్షాటనము చేయువాడను అని శోభనాద్రిగారు నా మేనల్లునికి నా కూతురునిచ్చు కొంద మనుచుండగా తాము సంపత్తు కలవారని నా సంబంధము వారి కమర్యాద హేతువని నన్న న్యాయము చేసి నా మేనల్లునకు వేరే సంబంధము చేసినాడు' శోభనాద్రిగారు ఆయన వద్దకు పోయి 'ఓరీ శాస్త్రులు! నాకా యూహ లేదు. నీవు పేదవాడివని నీయందు తక్కువ చూపు లేదు. నీ కూతురును నా కొడుకునకు చేసికొందును' - అని చెప్పి చెప్పుట యేమి లగ్నము పెట్టుట యేమి! యింటికి వచ్చుట యేమి! మేము పది పదేను బళ్ళ మీద తరలి వెళ్ళుట యేమి! వడ్లు దంపించి అయిదారు బస్తాల బియ్యముతో అయిదు రోజుల పెళ్ళికి కావలసిన సర్వ వ్యయముతో కొత్తబట్టలతో వెళ్ళుట యేమి! పెళ్ళి చేసికొని తిరిగి వచ్చుట యేమి!"

> **విశ్వనాధవారు ఆత్మకథ గురించి అద్భుతమైన వివరణ మొదట్లోనే యిచ్చారు. 'ఎలుక యెంతవఱకు తన వైపునకే తవ్వుకొను నన్నట్లు ఆ కవి యొక్క జీవుడు. వాడనుభవించినాడు. వాడు స్వానుభవాభిముఖముగానే చెప్పును. సుగ్రీవుడు శ్రీరామచంద్రునితో తనకు తన యన్నగారు చేసిన యపకారము తన దృష్టితో చెప్పినాడు. దానినే వాలిని చెప్ప మన్నచో నది యెట్లుండును? ఇది వాల్మీకి దోషము కాదు. లోకములో జరిగెడి కథల యందు సహజముగా నున్న దోషము.'**

రామాయణ కల్పవృక్షములో దశరధ మహారాజునందు 'మా నాయనగారి లక్షణములు నిరూపించి వ్రాసితిని' అని చెప్పుకొన్నారు.

నందమూరులో విశ్వేశ్వరుని భక్తిగా తలుచుకొంటూ 'మా స్వామికి నా కవిత్వము నిండ పట్టాభిషేక మొనర్చితిని. కల్పవృక్ష ప్రతి ఖండాంతమునందు మా విశ్వేశ్వర స్వామియే యున్నాడు. మా నాయనగారి శివభక్తి నా శివభక్తి మా స్వామి నన్నేలికొన్న లక్షణ్ము సువుదితము కాగలదు" అన్నారు.

ఈరోజుల్లో కులాలు మనుషుల్ని విడదీసి స్పర్ధలు పెంచుతున్నాయి. కానీ ఆనాటి వ్యవస్థ ఎంత గొప్పగా సాన్నిహిత్యాన్ని పెంచుకుందో చెప్పడానికి ఆత్మకథలో రెండు ఉదాహరణలు. 'ఈ దినములలో ఆ కులము పేరు చెప్పుట తప్పు. కానీ ఊరందరు సాలె శేషయ్య అనెడివారు. పిల్లలము మేమనుటకు వీలు లేదు. ఆయన వరుసకు మాకు పిన తండ్రి. శేషయ్య బాబాయి అనవలసినదే. వట్టిపేరుతో నన్నచో నీవు శేషయ్యకు బొడ్డు కోసి పేరు పెట్టితివా శేషయ్య బాబాయి అన్లేవా అని మా పెద్దవారు దండించెడివారు."

వారి ఊరిలో బ్రహ్మన్న అనే కమ్మవారుండేవారు. వారి ప్రసక్తి: ఆయన వియ్యంకుడొకనాడు బ్రహ్మయ్యగారితో నన్నాడట! "బ్రహ్మయ్యగారూ! అంతా బాగుగనే యున్నది కాని ఈయన మిమ్ము 'యేరా!' అనుట బాగాలేదు" అని. అప్పుడు బ్రహ్మయ్యగారు "అది యేమిటండీ! మేమిద్దరము మేనత్త మేనమామ బిడ్డలము. ఆయన నాకంటే తేలికగా నేడెనిమిదేండ్లు పెద్దవాడు. నన్ను గారన్వచ్చునా! అన్నచో నాకు ఆయుష్షు నష్టము కదా! ఆయన నన్ను 'ఏరా' అని పిలుచుట మీ కిష్టము లేనిచో మా సంబంధము మాని వేయుడు" అని. ఆ బ్రహ్మన్నగారు భార్యమీద కోపము వచ్చి అలిగి అన్నము తినకుండా పండుకొన్నచో-వారి యింట్లో శేషమ్మ అత్త అని ఒకామె యుండెడిది. ఆమె వచ్చి నన్నతో చెప్పుట, ఈయన వెళ్ళి కోపపడి జబ్బ పట్టుకొని లేవదీసి అన్నము తినిపించి మరీ యింటికి వచ్చెడివాడట.

ఈ వ్యవస్థ యీ అనుబంధాలూ నిన్న మొన్నటివని వినడానికే ముచ్చటగా, అపూర్వంగా వున్నాయి. ఆయన తన గ్రామం గురించి చెప్తూ 'పరమేశ్వరుని దయచేత నెవని జీవన సంపుటిలో కవితా శక్తియు, నార్ద్రతయు నుండునో అట్టివాడు మా గ్రామమున పుట్టినచో మహాకవి కాక చచ్చునా!! అన్నారు.

అసలు ఆత్మకథ ఎందుకు అన్నదానికి ఆయన వివరణ: "అయ్యా! ఇది నా అనుభవము. నేను పొందిన బాధ. నేను పడిన కష్టము. ఈ బాధకు నీ కష్టమునకు నేనిందెవరిని పేర్కొందునో వారు బాధ్యులు కారు...అపకారము చేసినవాడో యుపకారము చేసినవాడో నిమిత్తమాత్రుడన్న భావము నాకు దృఢమయినదని మనవి చేయుచున్నాను. ఈ గ్రంథములో నా ప్రధానమయిన యుద్దేశమేమనగా- నా వైరాగ్యము నా భగవద్భక్తి నా సంప్రదాయబద్ధ బుద్ధి లక్షణము- కవితా విద్యయందు నేను పొందిన యభివృద్ధి..' చెప్పడం. అప్పటికి వారి వయస్సు 74 సంవత్సరాలు. ఈ ఆత్మకథని 1979లో ప్రచురించారు.

ఈ వ్యాసం రాస్తూనే విశ్వనాధవారి అబ్బాయి పావనిశాస్త్రిగారికి ఫోన్ చేశాను. ఆయన కొన్ని కొత్త విషయాలు చెప్పారు. తర్వాతి కథ విశ్వనాధవారు రాయడానికి యిష్టపడలేదట. అయితే దాదాపు నాలుగు సంవత్సరాలపాటు వారితో ప్రసంగాలలో ముందుకథని పావనిశాస్త్రిగారు తెలుసుకొన్నారు. దానిని వారు రచించారు. ఆ కథని 'ఆత్మా వై కథ' అన్నారు. ఎందుకలా పేరు పెట్టారని అడిగాను. ఆత్మా వై పుత్రనామాసి కదా? (ఆత్మే పుత్రుని నామకంతో వున్నది అని అర్థం) వారి కథని నేను చెప్తున్నాను కనుక-త్వమేవాహమ్ అనే స్పర్శ రావాలి కనుక అలా శీర్షిక ఉంచానన్నారు. ఇప్పుడు విశ్వనాధ వారి కథ 350 పేజీలయింది. "మీరెలాగూ ప్రేరణ యిచ్చారు కనుక ఈ సంవత్సరంలోనే ముద్రణ పూర్తిచేస్తా"నన్నారు. ఇది అస్మదాదులకు శుభవార్త.

పుస్తకం దొరికే చోటు: విశ్వనాధ పావని శాస్త్రి, 6-3-596/52 వెంకట రమణా కాలనీ, ఖైరతాబాద్, హైదరాబాద్-500004, టెలిఫోన్ నంబరు: 23321000.

☆